# కేంద్ర ప్రభుత్వం.. వ్యయ- రాబడి ధోరణులు

**ఒక దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి వ్యయ, రాబడులు ఎంతో కీలకం. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో వ్యయ-రాబడుల ధోరణులు ఎంతో ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ వ్యయ- రాబడి ధోరణులపై విశ్లేషణ..**



స్వాతంత్ర్యానంతరం జాతీయ, తలసరి ఆదాయాల్లోని పెరుగుదల కారణంగా కేంద్ర ప్రభుత్వానికి రాబడినిచ్చే మార్గాలు కూడా పెరిగాయి. రెండో ప్రపంచ యుద్ధం ముందు కాలంలో ప్రభుత్వ రాబడిలో పెరుగుదల తక్కువగా ఉండేది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పెరిగిన ప్రభుత్వ వ్యయం నేపథ్యంలో ప్రభుత్వం రాబడి పెంచుకొనే మార్గాల కోసం అన్వేషించింది. అప్పటికే అమల్లో ఉన్న పన్ను రేట్లను పెంచడం, కొత్త పన్నులను విధించడం వంటి చర్యలు చేపట్టింది. ఈ ధోరణి రెండో ప్రపంచయుద్ధం ముగిసేవరకు కొనసాగింది.

కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ ఖాతాకు సంబంధించి రెవెన్యూ రాబడులు – పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా లభిస్తాయి. పన్నులకు సంబంధించి రాబడి

- ఆదాయం పై పన్ను
- సంపద, మూలధన లావాదేవీలపై పన్ను
- వస్తు, సేవలపై పన్నుల నుంచి లభిస్తుంది.

విత్త, ఇతర సేవలు, వడ్డీ రాబడులు, డివిడెండ్లు, లాభాల ద్వారా పన్నేతర రాబడి లభిస్తుంది.

## రెవెన్యూ రాబడుల ధోరణులు:

కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడులు స్వాతంత్ర్యానంతరం గణనీయంగా పెరగడానికి అధిక పన్నులు, పన్ను రేట్లు ఎక్కువగా ఉండటం, కొంత మేర ద్రవ్యోల్బణం కారణమయ్యింది. 1950–51లో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడులు ₹ 406 కోట్లు కాగా సవరించిన అంచనాల ప్రకారం 2010–11లో ₹ 7,83,833 కోట్లకు పెరిగింది. 2011–12 బడ్జెట్‌లో మొత్తం రెవెన్యూ రాబడి ₹ 7,89,892 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం రెవెన్యూ రాబడిలో పన్నుల వాటా 1950–51లో 88 శాతం నుంచి 1997–98లో 74 శాతానికి తగ్గి 2011–12 బడ్జెట్‌లో 84.11 శాతానికి చేరుకుంది. పన్నేతర రాబడి మొత్తం రెవెన్యూ రాబడిలో

1950–51లో 12 శాతం కాగా 2011–12 బడ్జెట్‌లో 15.88 శాతానికి పెరిగింది.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నుల్లో ఆదాయపు పన్ను, వ్యయ పన్నులను పురోగామి పన్నులుగా భావించవచ్చు. గత రెండు దశాబ్దాలుగా పన్ను ఎగవేతను నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను రేట్లను తగ్గించింది. వేగవంతమైన పారిశ్రామికీకరణ వల్ల వ్యక్తుల ఆదాయాల్లో వచ్చిన పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వానికి ఆదాయపు పన్ను రాబడి పెరిగింది. 1950–51లో ఆదాయపు పన్ను రాబడి ₹ 140 కోట్ల నుంచి 2010–11లో ₹1,49,066 కోట్లకు చేరింది. కాగా 2011–12 బడ్జెట్‌లో ఈ పన్ను ద్వారా రాబడి ₹ 1,72,026 కోట్లకు పెరిగింది. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వానికి అత్యధిక రాబడి కార్పొరేషన్ పన్ను ద్వారా లభిస్తున్నది. కంపెనీల ఆదాయంపై ఈ పన్ను విధిస్తారు. పెద్ద, చిన్న తరహా కంపెనీలు ఆర్జించే లాభాలపై ఈ పన్ను విధిస్తారు. 2002లో పన్నుల సంస్కరణలపై ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ (విజయ్ కేల్కర్ నేతృత్వంలో) సిఫార్సుల నేపథ్యంలో స్వదేశీ, విదేశీ కంపెనీలపై ఈ పన్ను రేట్లను కొంత మేర తగ్గించారు.

1950–51లో కార్పొరేషన్ పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ₹ 40 కోట్లు రాబడి రాగా 2010–11లో సవరించిన అంచనాల ప్రకారం ఈ రాబడి ₹ 2,96,377 కోట్లు. కాగా 2011–12 బడ్జెట్‌లో దీనిని ₹ 3,59,990 కోట్లుగా నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వం సంపద, మూల ధన లావాదేవీలపై సంపద పన్ను, బహుమతి పన్ను విధిస్తుంది. వారసత్వంగా సంక్రమించిన ఆస్తులపై ఎస్టేట్ సుంకం విధిస్తారు. బహుమతి పన్ను, ఎస్టేట్ సుంకాలను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. సంపద, సంపద బదిలీలపై పన్ను విధించడానికి ముఖ్య కారణం పెరుగుతున్న ఆదాయ అసమానతలను తగ్గించడం. అయితే అనేక మినహాయింపుల కల్పించడం, అవినీతిమయమైన ప్రత్యక్ష పన్ను అమలు విధానం నేపథ్యంలో ఈ లక్ష్యం నెరవేలేదు.

వస్తువులపై పన్నుకు సంబంధించి కేంద్ర ఎక్సైజ్ పన్ను, కస్టమ్స్ సుంకం ముఖ్యమైనవి. ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో అదనపు రాబడి కోసం ఎక్సైజ్ పన్నును కేంద్రం ప్రధాన సాధనంగా గుర్తించింది. దేశం లోపల తయారైన వస్తువులపై ఈ పన్ను విధిస్తారు. రాష్ట్ర ప్రభు

త్వాలు కొన్ని వస్తువులపై ఎక్సైజ్ పన్ను విధిస్తే వాటికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ పన్ను మినహాయింపునిస్తుంది.

1950-51లో ఎక్సైజ్ పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ₹ 70 కోట్లు లభించగా 2010-11లో సవరించిన అంచనాల ప్రకారం ఈ రాబడిని ₹ 1,64,116 కోట్లుగా అంచనా వేశారు. కస్టమ్స్ డ్యూటీల ద్వారా వచ్చే రాబడిలో కూడా గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఇనుము, ఉక్కు, రసాయనాలు, డ్రగ్స్, మెడిసిన్, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులు పెరిగిన నేపథ్యంలో 1950-51లో కేంద్ర ప్రభుత్వానికి ఈ పన్ను ద్వారా రాబడి ₹ 160 కోట్లు కాగా 2010-11లో ₹ 1,31,800 కోట్లకు పెరిగింది. 1994 -95లో ప్రవేశపెట్టిన సేవల పన్ను ద్వారా 2010-11లో ₹69,400 కోట్లు లభించింది.

## ప్రభుత్వ వ్యయం:

1990 ప్రారంభం నుంచి ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరిగింది. మొత్తం వ్యయంలో అభివృద్ధి పరమైన వ్యయం వాటా కూడా పెరుగుతోంది. వివిధ అంశాలకు సంబంధించి చేసిన వ్యయం మొత్తాన్ని పరిశీలిస్తే.. దానిని అభివృద్ధి వ్యయమా లేదా అభివృద్ధేతర వ్యయమా అని వర్గీకరించాలి. వీటితోపాటు అభివృద్ధి వ్యయానికి ఇచ్చిన ప్రాధాన్యం, వివిధ రంగాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ, ప్రభుత్వ వ్యయ నియమాల అమలు, అభివృద్ధి వ్యయం వల్ల సమాజానికి చేకూరిన లబ్ధి వంటి అవకాశాలను వ్యయ వర్గీకరణలో పరిగణనలోకి తీసుకోవాలి.

స్వాతంత్ర్యానంతరం దేశంలో జనాభా వృద్ధి రేటు అధికంగా ఉండటం, స్థూల దేశీయోత్పత్తిలో పెరుగుదల, పట్టణీకరణ అధికం కావడం, రక్షణ రంగంపై అధిక వ్యయం, పరిపాలనా యంత్రాంగం విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్టులపై వ్యయం పెరగడం, లోటు బడ్జెట్ విధానాన్ని అనుసరించడంతోపాటు ప్రకటిత, అప్రకటిత సబ్సిడీ వ్యయాలు పెరగడం, ప్రభుత్వ వ్యయం పెరుగుదలకు కారణమయింది. 1987-88 ముందు కాలంలో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయాన్ని..

- సివిల్ ఎక్స్‌పెండిచర్ (సాధారణ సేవలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలపై వ్యయం)
- రక్షణ వ్యయం
- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రాంట్లుగా వర్గీకరించారు.

  1987-88 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయాన్ని ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం అనే భావనలతో కొత్త వర్గీకరణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ వ్యయ ధోరణులను పరిశీలిస్తే..

- స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయం గణనీయంగా పెరిగింది. 1950-51లో రెవెన్యూ వ్యయం ₹ 350 కోట్లు కాగా 2010-11లో ₹10,53,677 కోట్లకు పెరిగింది. 2011-12 బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయాన్ని ₹ 10,97,162 కోట్లుగా అంచనా వేశారు. పరిపాలనా విస్తరణ, రక్షణ వ్యయం పెరుగుదల, ప్రజాస్వామ్య వ్యవస్థల వ్యయం పెరగడం ఇందుకు కారణమయింది. దేశంలో మానవాభివృద్ధిని పెంపొందించే క్రమంలో విద్య, ఆరోగ్య రంగాలపై వ్యయం పెరిగింది.
- ఇటీవల కాలంలో ప్రణాళికేతర వ్యయంలో పెరుగుదల చాలా వేగంగా ఉంది. 1980లలో ప్రణాళికేతర వ్యయం వార్షిక పెరుగుదల సగటు ₹ 5000 కోట్లు కాగా 1990 లలో సగటు వార్షిక పెరుగుదల ₹ 10,000 నుంచి ₹12,000 కోట్లకు చేరింది. ప్రణాళికేతర వ్యయంలో వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం, సబ్సిడీలు, సాధారణ సేవల వాటా 80 శాతం వరకు ఉంటుంది.

  1989-90 సంవత్సరంలో ప్రణాళికేతర వ్యయం ₹64,500 కోట్ల నుంచి 2010-11 సంవత్సరానికి ₹8,21,552 కోట్లకు చేరింది. 2011-12 సంవత్సరం బడ్జెట్‌లో ఈ వ్యయాన్ని ₹ 8,16,182 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ, మూలధన ఖాతాలో కలిపి రక్షణ రంగంపై చేసిన వ్యయం 1950-51లో ₹ 160 కోట్లు కాగా 2011-12 సంవత్సరం బడ్జెట్‌లో ₹ 1.64 లక్షల కోట్లుగా అంచనా వేశారు. పెరుగుతున్న ప్రణాళికేతర వ్యయాన్ని ప్రభుత్వం నియంత్రించినట్లయితే రెవెన్యూ లోటును పూడ్చటానికి ప్రభుత్వం రుణం ఎక్కువగా చేయాల్సి వస్తుంది.
- ప్రభుత్వ రుణంలో పెరుగుదల కారణంగా ప్రభుత్వానికి వడ్డీ చెల్లింపుల భారం పెరిగింది. 1986-87లో వడ్డీ చెల్లింపులు ₹ 9250 కోట్ల నుంచి 2010-12 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో 18 శాతానికి పెరిగింది. వడ్డీ చెల్లింపులతోపాటు సాధారణ సేవలపై ముఖ్యంగా పన్ను వసూళ్ల కోసం వ్యయం, పోలీస్ పింఛన్లు, వేతన సిఫార్సుల మేరకు వేతనాల పెరుగుదల, కరువు భత్యం పెరుగుదల వంటి వ్యయాల పెరుగుదల వ్యయం పెరగడానికి కారణమైంది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో వడ్డీ చెల్లింపులు అతి పెద్ద ముఖ్య అంశంగా నిలిచింది.
- స్వాతంత్ర్యానంతరం లక్షిత వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో ప్రభుత్వం అవలంబించిన సబ్సిడీల విధానం ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు కారణమయ్యింది. ఆహార, ఎరువుల సబ్సిడీలతోపాటు ఎగుమతులను ప్రోత్సహించడానికి సబ్సిడీలు ప్రకటించింది. 1981-82లో మొత్తం సబ్సిడీల వ్యయం ₹1560 కోట్లు కాగా 2011-12 బడ్జెట్‌లో ₹ 1,43,570 కోట్లుగా అంచనా వేశారు.

### ముఖ్యాంశాలు

- సబ్సిడీలపై వ్యయం 2004-05 జీడీపీలో 1.4 శాతం కాగా 2008-09లో 2.3 శాతం.
- 1950-51లో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడిలో పన్నుల వాటా 88 శాతం కాగా పన్నేతర రాబడి వాటా 12 శాతం.
- 2011-12 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడిలో పన్నుల వాటా 84.11 శాతం కాగా పన్నేతర రాబడి వాటా 15.88 శాతం.
- ఆదాయపు పన్ను ద్వారా ప్రభుత్వానికి రాబడి

1950–51లో ₹ 140 కోట్లు కాగా 2011–12 బడ్జెట్‌లో ₹1,72,026 కోట్లుగా అంచనా వేశారు.

- 1950–51లో కేంద్ర ప్రభుత్వానికి మొత్తం పన్నుల రాబడి ₹ 357 కోట్లు కాగా 2010–11లో సవరించిన అంచనాల ప్రకారం ₹ 7,86,888 కోట్లు.
- 1950–51లో కేంద్ర ప్రభుత్వానికి కస్టమ్స్ డ్యూటీల ద్వారా రాబడి ₹ 160 కోట్లు కాగా 2010–11లో సవరించిన అంచనాల ప్రకారం ₹ 1,31,800 కోట్లు.
- 2011–12 బడ్జెట్‌లో మొత్తం పన్ను రాబడి వృద్ధి 18 శాతం
- 2011–12 బడ్జెట్‌లో మొత్తం స్థూల పన్ను రాబడిలో ఎక్సైజ్ పన్ను రాబడి వృద్ధి 19 శాతం, కస్టమ్స్ సుంకం పన్ను రాబడి వృద్ధి 15.1 శాతం కాగా సేవలపై పన్ను రాబడి వృద్ధి 21.5 శాతం
- సేవలపై పన్నును 1994–95లో ప్రవేశపెట్టారు.
- కేంద్ర ప్రభుత్వం విధించే పన్నుల్లో ఆదాయం, వ్యయ పన్నులను పురోగామి పన్నులుగా భావించవచ్చు.